# వైఎస్ఆర్-అన్నమయ్య



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త



బుధవారం 18 జూన్ 2025


## అన్యాక్రాంతమైన దేవాలయ భూములను రికార్డుల్లో పొందుపరచండి

పులివెందుల, జూన్17, ప్రభాతవార్త:

పులివెందుల, లింగాల మండలాల పరిధిలో అన్యాక్రాంతమైన భూములను కాపాడాలంటూ, వాటిని రికార్డుల్లో పొందుపరచాలని పులివెందుల గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈవో వెంకటరమణ రెవెన్యూ అధికారులను కోరారు. ఈ మేరకు పులివెందుల డిప్యూటీ తాసిల్దార్ వెంకటరెడ్డికి ఆయన మంగళవారం వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల, లింగాల మండలాల పరిధిలో దాదాపుగా 500 ఎకరాల దేవాదాయ భూములు ఇతర వ్యక్తుల పేరుతో నమోదయి ఉన్నాయని వెల్లడించారు. వీటిని సర్వే చేసి తిరిగి దేవస్థానానికి అప్పగించేలా దేవస్థానం పేరు మీద రిజిస్టర్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ మేరకు వినతిపత్రాన్ని రెవెన్యూ అధికారులకు అందజేశామని ఆయన తెలిపారు.



డిప్యూటీ తహసీల్దార్ కు వినతి పత్రం అందచేస్తున్న దృశ్యం

## హత్యకేసులో దర్యాప్తు ముమ్మరం

### పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు...!

### భార్యపైనే అనుమానం

మదనపల్లెక్రైం, జూన్ 17 ప్రభాతవార్త :

మదనపల్లెలో ఆదివారం రాత్రి జరిగిన హత్యకుసును పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. బసినికొండ పంచాయతీకి చెందిన గంగాధర్ (37) హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్యకేసును నమోదు చేసిన తాలుకా పోలీసులు డిఎస్పీ మహేంద్ర అధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈకేసుకు సంబంధించి ముగ్గురు నిందితులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. అందులో హతుడు భార్య వనిత కూడా వుంది. హత్యకేసులో వనిత ప్రధాన నిందితురాలుగా పోలీసులు బావిస్తున్నారు. పోలీసుల విచారణలో తన భర్తను తానే హత్యచేయించినట్లు అంగీకరించినట్లు సమాచారం. భర్త వేధింపులు భరించలేక భర్తను హత్య చేయించినట్లు తెలిసింది.

# మామిడి రైతులకు అండగా ప్రభుత్వం

### ఆగస్టు వరకు కిలోకు నాలుగు రూపాయల ఆర్థిక సాయం

### ప్రభుత్వ రికార్డులతో అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు

### జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాజంపేట జూన్ 17 ప్రభాతవార్త

తోతాపురి మామిడి రకం పండించే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టమైన హామీ ఇచ్చారని ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి వెల్లడించారు. మామిడి రైతులకు ఆర్థికపరమైన భరోసా ఆగస్టు వరకు కొనసాగుతుందని స్పష్టం చేశారు. రైతులు తొందరపడి పక్వానికి రాకుండా కాయలు కోయవద్దని సూచించారు. రైల్వే కోడూరులో మామిడి మార్కెట్ యార్డ్ ను పరిశీలించిన తర్వాత రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తోతాపురి రకం మదనపల్లె నుండి రైల్వేకోడూరు వరకు ప్రతిరోజు 800 మెట్రిక్ టన్నులు కాయలు కోస్తున్నారని వెల్లడించారు. తిరుపతి,చిత్తూరు జిల్లాలో తోతాపురి కాయలు కొనుగోలు చేసే పల్ప్ యూనిట్లు కంపెనీలు 40 ఉన్నాయని, అన్నమయ్య జిల్లాలో కోడూరులో ఒకటి ఉందని తెలిపారు. అన్ని యూనిట్లలో కలిపి వాటి సామర్థం కంటే ఎక్కువ ప్రాసెస్ జరుగుతున్నాయని వెల్లడించారు. రైతులు తొందరపడి పక్వానికి రాకుండా కాయలు కోస్తే వారికే నష్టం చేకూరుతుందని స్పష్టం చేశారు. ఎందుకంటే ఇప్పటితో రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం ఆగిపోదని ఆగస్టు వరకు కొనసాగుతుందని స్పష్టంగా వివరించారు. అందువల్ల రైతులు తొందర పడాల్సిన అవసరం లేదని తెలిపారు. పల్ప్ యూనిట్లు స్టోరేజ్ కెపాసిటీ బట్టి రైతుల నుంచి కాయలు కొనుగోలు చేసి నిలువ చేస్తారని అంతకుమించి ఎక్కువ నిలువ చేస్తే కాయలు చెడిపోతాయని స్పష్టం చేశారు. స్థానికంగా కాని ,ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వ్యాపారులకు కానీ అమ్మినా రైల్వేకోడూరు ప్రాంత హార్టికల్చర్ అసిస్టెంట్ లేదా వ్యవసాయ శాఖ అధికారి ద్వారా నమోదు చేయించుకుని ఉంటే చాలని అలాంటి రైతుల ఖాతాల్లో ప్రభుత్వం అందించే కి నాలుగు రూపాయల ఆర్థిక సాయం జమ అవుతుందని తెలియజేశారు. పల్ప్ యూనిట్ల వద్ద టోకెన్ సిస్టం ద్వారా ముందు వచ్చిన రైతును ఎంట్రీ చేసుకొని ఆ మేరకు పంపుతారని, అంతే కాకుండా అక్కడ రెవెన్యూ , పోలీస్, హార్టికల్చర్ అధికారులు కూడా ఉంటారని తెలియజేశారు. రాయచోటి లో రెవెన్యూ అధికారి ఇంట్లో సోదాలు జరిగిన విషయంపై మీడియా ప్రతినిధుల అడిగిన ప్రశ్నకు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొందరు రిటైర్డ్ రెవిన్యూ ఉద్యోగులు వారి వద్ద ఒరిజినల్ డీకేటి, వన్ బి ,అడంగల్ లు ఉంచుకొని ఒరిజినల్ డికేటి ల్లా ప్రభుత్వ స్థలాలకు దొంగ పట్టాలు ఇస్తున్నట్టు సమాచారం సేకరించామన్నారు.వారిపై బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ 97 కింద సెర్చ్ నిర్వహించి,రికార్డులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసామన్నారు.రాజంపేటలోని అతి పెద్ద చక్రాల మడుగు లో దాదాపు 1500 నివాసాలల్లో 3000 మంది నివాసం ఉంటున్నారనీ తెలిపారు. ఇప్పుడు జరిగిన ఆక్రమణలు కాకుండా మిగిలిన మడుగు ఆక్రమణలు జరగకుండా కాపాడుకుంటామనీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి, రాజంపేట సబ్ కలెక్టర్ నైదియాదేవి

### కొత్త నిబంధనలతో

## ఒప్పంద అధ్యాపకులకు భద్రతకు ముప్పు



కొత్త నిబంధనలపై ఆందోళన వ్యక్తం చేస్తున్న ఒప్పంద అధ్యాపకులు

పులివెందుల,జూన్17, ప్రభాత వార్త:

జేఎన్టీయూ అధికారులు తెచ్చిన కొత్త నిబంధనలతో ఒప్పంద అధ్యాపకులుకు ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లుతోందనీ ఆవేదన అవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని స్థానిక జేఎన్టీయూ కళాశాల నందు ఒప్పంద అధ్యాపకులు జేఎన్టీయూ అనంతపురం అధికారులు తీసుకున్న నిర్ణయాలపై నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళన ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఎలాంటి ఇంటర్వ్యూలు లేకుండా సర్వీసును పునరుద్ధరించడం జరిగేది అని కానీ అనంతపురం జేఎన్టీయూ విశ్వవిద్యాలయ అధికారులు ఏడాది ఇంటర్వ్యూలు పెట్టి సర్వీస్ ను పునరుద్ధరించడం జరిగిందన్నారు. అయితే మళ్లీ కొత్త నిబంధనలు తెరపైకి తెచ్చి ఖాళీగా ఉన్న పోస్టులో తాము విధులు నిర్వర్తిస్తున్నట్లు, ఏ క్షణమైనా తమను విధుల్లో నుంచి తొలగించే హక్కు యాజమాన్యానికి ఉంటుందని నిబంధనలను పెట్టార న్నారు. యూనివర్సిటీ చేపట్టే నియామకాల్లో తమకు వెయిటేజీ, మార్కులు, సర్వీసు వర్తించవని, అలా కాదని కోర్టుకు వెళ్లడం చేయకూడదని నిబంధనలు పెట్టారన్నారు. ఇది ఉద్యోగ భద్రతకు భంగం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తమను ఇబ్బంది పెట్టవద్దని మేము గత పది ,పదిహేను సంవత్సరాల నుంచి పని చేస్తున్నామని కొత్త నిబంధనలు తొలగించి మాకు ఉద్యగ భద్రత కల్పించాలి అని ఒప్పంద అధ్యాపకులు ఉన్నతాధికారులను మీడియా ద్వారా కోరారు.

# ప్రతి కుటుంబం యోగాతో ఆరోగ్య భాగ్యాన్ని పొందండి..

### గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు కార్యక్రమ నిర్వహణకు కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లాలి

### ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలలో ప్రతి ఒక్కరూ యోగాంధ్రలో భాగస్వామ్యం కావాలి

### ఈ నెల 20న అన్నిచోట్లా మాక్ డ్రిల్ నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి






కడప, జూన్ 17 : ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 21న జిల్లా వ్యాప్తంగా గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి తగు కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సభా భవన్ లో 11 వ అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా ఈ నెల 21 న గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు నిర్వహించే కార్యక్రమాల నిర్వహణపై జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ను పురస్కరించు కొని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా మే 21 నుండి జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర మాసోత్సవాలను నిర్వహిస్తోందనన్నారు. ప్రతి పౌరుని ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగ విశిష్టతను ప్రజలకు చాటి చెప్పేందుకు ఈ కార్యక్రమాలను అత్యంత ప్రాధాన్యత గా తీసుకొని నిర్వహించడం జరుగు తోందనన్నారు. జిల్లా లో యోగా మాసోత్సవాల్లో భాగంగా ఇది వరకే అనేక కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని, పర్యాటక కేంద్రాలైన ఒంటిమిట్ట, సిద్ధవటం శిల్పారామం లలో కార్యక్రమాలు నిర్వహించా మన్నారు. ఈ నెల 18న గండి కోట పర్యాటక ప్రాంతంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో దాదాపు 5 వేల నుండి 6 వేల మందితో యోగా నిర్వహించడం జరుగు తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా 5,750 మంది యోగా శిక్షకుల ద్వారా ఇప్పటివరకు 5 లక్షల 60 వేల మందికి యోగ పై శిక్షణ మరియు అవగాహన కల్పించడం జరిగిందనన్నారు. జిల్లాలో ఇప్పటివరకు అన్ని వర్గాల ప్రజల నుండి యోగ పై ఆసక్తి ఉన్నవారు దాదాపు తొమ్మిది లక్షల మంది వరకు వారి వారి పేర్లను యోగాంధ్ర యాప్ లో నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. ప్రపంచ యోగా దినోత్సవంలో భాగంగా జూన్ 21వ తేదీన.. విశాఖపట్నంలో జరిగే యోగా కార్యక్రమంలో దేశ ప్రధాని నరేంద్రమోడీ, మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారు పాల్గొననున్నారన్నారు. జిల్లా లో ఈనెల 21న గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు జరిగే యోగాంధ్ర కార్యక్రమాలను ఉదయం ఏడు గంటలకల్లా కచ్చితంగా ప్రారంభించి 8 గంటలలోపు పూర్తి చేయాలన్నారు. ఇందులో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు యోగ విశిష్టతను వివరించే యోగా గురువులచే పలు రకాల ప్రసంగాలు తదితర కార్యక్రమాలను ఉదయం 8 గంటల లోపే పూర్తి చేయాలన్నారు. ప్రతి పౌరుడు వారి ఆరోగ్య సంరక్షణకు వారి కుటుంబంతో సహా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యేలా గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం తో పాటు స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ట్రేడ్ అసోసియేషన్లు భాగస్వామ్యంఅయ్యేలా ప్రతి ఒక్కరిని ప్రోత్సహించాలన్నారు. జిల్లా కేంద్రం కడప నగరానికి సంబంధించి.. ప్రధాన వేదికగా వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో నిర్వహించడం జరుగుతోందన్నారు. అంతే కాకుండా నగరంలోని మున్సిపల్ మైదానం, ఆర్ట్స్ కళాశాల మైదానం, మరికొన్ని ప్రధాన రహదారుల్లో నిర్వహించాలని, అలాగే అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో, ప్రధాన పట్టణాల్లోని ప్రధాన ప్రాంతాల్లో యోగా కార్య క్రమాలు నిర్వహించాలన్నారు. పోలీసు వారు ప్రధాన కూడలిలలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ యోగా మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించే యోగా కార్యక్రమాల్లో కార్యక్రమాల్లో అన్ని మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రత్యేకించి వైద్యశాఖ నుండి వైద్యుల నుండి ఏఎన్ఎంల వరకు అలాగే ఐసిడిఎస్, డిఆర్డీఏ, మెప్మా, శాఖల వారీగా వారి పరిధిలో ఉన్న వారితో యోగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులతో పాటు వారి సిబ్బంది కూడా యోగ కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా నిర్వహిస్తున్న యోగా కార్యక్రమంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచే దిశగా మీడియా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విశ్వేశ్వర్ నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు మొక్క జొన్న కంపెనీ టోకరా

దువ్వూరు, జూన్ 17, ప్రభాతవార్త:



మండలంలోని రైతులకు మొక్క జొన్న కంపెనీ టోకరా వేసింది. గత సంవత్సరం మండల పరిధిలో దాదాపు 1000ఎకరాలకు పైగా కంపెనీ క్రాసింగ్ మొక్కజొన్న విత్తనాలు ఇవ్వడంతో రైతులు సాగు చేశారు. పంట వేసే సమయంలో ఎకరాకు 50 నుండి 60 వేల వరకు ఆదాయం వస్తుందని, ఒక వేళ పంట దిగుబడి రాకపోతే కంపెనీ 50వేలు నష్ట పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చి రైతులచే పంట సాగు చేయించారు. అయితే పంట వేసే సమయంలో కంపెనీకి రైతులకు ఎటు వంటి ఒప్పంద పత్రాలు లేకుండా సాగు చేయించారు. రైతులు డబ్బులు వస్తాయని ఆశ పడి క్రాసింగ్ మొక్కజొన్న పంటను సాగు చేశారు. అయితే మండల వ్యవసాయ శాఖ వారు రబీ సీజన్లో వివిధ సమావేశాలు ఏర్పాటుచేసి ఇటువంటి పంటలు సాగు చేసేటప్పుడు ఖచ్చితంగా ఒప్పందం తీసుకోవాలని సూచించారు. అయితే రైతులు కంపెనీ రైతులకు ఎటువంటి ఒప్పంద పత్రాలు లేకుండా సాగు చేయించారు. తీరా దిగుబడి సమయంలో మొక్కజొన్న క్వింటాల్ దిగుబడి వచ్చింది. రైతుల నుండి వచ్చిన పంటను కంపెనీకు తీసుకువెళ్లి 40రోజులకు మీ అకౌంట్లో డబ్బులు వేస్తామని చెప్పారు. కానీ దాదాపు 4నెలలు అవుతన్న కంపెనీ ప్రతినధులు రైతులకు ఇంతవరకు డబ్బులు వేయలేదు. ప్రతి రోజు ఫోన్లు చేస్తున్న పలకడం లేదని రైతులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఉన్నతాధికారులను సంప్రదించి కంపెనీ లాంటి ఆగడాలను అరికట్టి రైతులకు డబ్బులు అందేడా చూడాలని మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులు కోరుతున్నారు. భవిష్యత్తులో వ్యవసాయ అధికారులు ఇటువంటి కంపెనీ విత్తనాలను పల్లెలకు రాకుండా అరికడితే రైతులు వేరే పంటల వైపు దృష్టి పెడతారు. కంపెనీ చేసిన మోసాలపై మండల వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ సదరు కంపెనీ మొక్కజొన్న పంట ఆశించిన మేర దిగుబడి రాకపోవడం వల్ల రైతులకు నష్ట పరిహారం చెల్లిస్తామని చెప్పి ఉన్నారు కానీ ఇంతవరకు చెల్లించడం లేదని రైతులు మా దృష్టికి తీసుకురావడంతో కంపెనీ ప్రతినిధులతో మాట్లాడటం జరిగిందని కంపెనీ వారు జూలై 10వ తేది లోపల నష్టపరిహారం ఇస్తామని పేర్కొన్నారన్నారు. ఒకవేళ గడువు లోపల చెల్లించకపోతే కంపెనీపై విత్తన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మొక్కజొన్న సాగు చేసిన రైతులు తెలిపారు.

### ఎన్టిఆర్ వైద్య సేవల్లో

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

కడప, జూన్ 17 : ప్రభాతవార్త:

డా.ఎన్టిఆర్ వైద్య సేవల్లో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని.. నెట్వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలకు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి హెచ్చరికలు జారీచేశారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్ లోని తన చాంబర్ లో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన డిస్ట్రిక్ట్ డిసిప్లినరీ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ విభాగం కింద కడప జిల్లా వ్యాప్తంగా 10 నెట్వర్క్ హాస్పిటల్స్ పైన 18 మంది పేషంట్లు ఐవిఆర్ ద్వారా అందించిన ఫిర్యాదుల మేరకు.. కమిటీ విచారణ చేపట్టడం జరిగింది. అందిన ఫిర్యాదులను పరిశీలించి నెట్వర్క్ హాస్పిటల్స్ హాస్పిటల్ వైద్యులు, యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నిబంధనలు ఉల్లంఘించి డా.ఎన్టీఆర్ వైద్య సేవల్లో అదనపు వసూళ్లకు పాల్పడిన వారిపై పెనాల్టీ కూడా విధించడం జరిగింది. పేషంట్ల నుండి వసూలు చేసిన మొత్తాన్ని వారికి తిరిగి చెల్లించేలా చర్యకు కుడా తీసుకోవడం జరిగింది. ఇలాంటి చర్యలు భవిష్యత్ లో పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని, నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలతో పాటు వారి వైద్య వృత్తిని శాశ్వతంగా రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డా. నాగరాజు, డా. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ డా.బాలాంజనేయులు, డిసిహెచ్ఎస్ డా. హిమదేవి, సంబంధిత వైద్య అధికారులు, నెట్వర్క్ ఆసుపత్రుల వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలి

కడప, జూన్ 17 : ప్రభాతవార్త:



జిల్లాలో పెండింగ్ లోవున్న అన్ని రకాల నిర్మాణ పనులను..త్వరితగతిన పూర్తి చేయాలని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో డిఎంఎఫ్ (డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్) ద్వారా జిల్లాలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి నిర్మాణ పనుల పురోగతిపై.. ఆయా శాఖల ఇంజనీరింగ్,వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో భాగంగా.. జిల్లా మినరల్ ఫండ్ ద్వారా నిర్మిస్తున్న వివిధ రకాల పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అర్బన్, రూరల్ ప్రాంతాల్లో చేపట్టిన అన్ని రకాల నిర్మణాలను నాణ్యతలో రాజీ లేకుండా పూర్తి చేయాలన్నారు. ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీల సమన్వయ సహకారంతో.. ఆయా నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న అన్ని రకాల పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.అలాగే ఆకాంక్ష జిల్లాల అభివృద్ధిలో భాగంగా.. పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్, హౌసింగ్, గనులు భూగర్భ శాఖల పరిధిలో పురోగతిలో ఉన్న పనులు త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఓ హాజరతయ్యా, డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్.ఈ. ఏడుకొండలు, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసులు రెడ్డి,గనులు భూగర్భ శాఖ డిడి వెంకట సాయి, హౌసింగ్ పీడీ రాజా రత్నం, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాముని ఆలయంలో ప్రత్యేక పూజలు

వేంపల్లె :జూన్ 17 (ప్రభాత వార్త)

స్థానిక బొడ్డు రాజన్న వీధిలో నూతనంగా నిర్మించిన సీతారాముడు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల విగ్రహ ప్రతిష్ట చేసి 41 రోజులు పూర్తయిన సందర్భంగా అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, హోమాలు నిర్వహించారు. భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వైఎస్ఆర్సిపి సర్పంచ్ ఆర్ శ్రీనివాసులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొత్తూరు రెడ్డయ్య, శ్రీకాంత్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



# రాచమల్లు అవినీతి, భూ కబ్జాలపై విచారణ జరిపి తీరుతా



ప్రొద్దుటూరు జూన్ 17 ప్రభాతవార్త

గత వైసిపి పాలనలో ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి చేసిన అవినీతి భూ కబ్జాలపై విచారణ జరిపి తీరుతామని దోషిగా నిల బెట్టేది ఖాయమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. మంగళ వారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత పత్రికా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పదేపదే తనపై చేసిన అసత్య ఆరోపణలకు స్పందించారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు తనపై ఎన్నిసార్లు అసత్య అవినీతి ఆరోపణలు చేసినా ప్రొద్దుటూరు ప్రజలు నమ్మే స్థితిలో లేరని, 40 ఏళ్ల తన రాజకీయ జీవితంలో తన వ్యక్తిత్వం నీతి నిజాయితీ గురించి ప్రజలకు తెలుసని వివరించారు. ప్రొద్దుటూరు పట్టణంలో గత ఎంతో కాలం నుండి అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్న మాట వాస్తవమేనని కానీ గత వైసిపి పాలనలో అది అధికారికంగా జరిగిందని ఆరోపించారు తన పాలనలో అసాంఘిక కార్యక్రమాలను అణచివేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తాను కాంట్రాక్టర్లను బెదిరించలేదని ఒకవేళ రాచమల్లు వద్ద ఆధారాలుంటే నిరూపించాలన్నారు. నిమ్మకాయల సుధాకర్ రెడ్డి స్థలం చెరువు భూమి అని తాను అపోహ పడి ఆ స్థల విక్రయానికి అడ్డు పడిన మాట వాస్తవమేనని, హైకోర్టు ఉత్తర్వుల తర్వాత తాను అడ్డు పడలేదని, అతనే స్వయంగా తమకు ఎటువంటి నగదు అందించ లేదని చెప్పిన మాట గుర్తించాలన్నారు. డిఎడబ్ల్యూ కళాశాల విషయంలో తాము అక్కడ భూమి కొన్నామని, అక్కడ రాచమల్లు ఎమ్మెల్యేగా వున్న సమయంలో అర్జీల ద్వారా పని ఆపే యత్నం చేస్తే వ్యాపారులకు నష్టం రాకూడదని తాము కూడా తమ వాటా మేర అతనికి ముడుపులు చెల్లించామని స్పష్టం చేశారు. టిడిపి నాయకులు చేసే అవినీతిని తాను సమర్థించనని, అసాంఘిక కార్యకలాపాలు ప్రొద్దుటూరు లో పలువురు అధికారుల సహకారం వలన ఇంకా కొనసాగుతున్నాయని, వాటిని ఆపడం అంత త్వరగా జరగదన్నారు. రాచమల్లు శివప్రసాద్ రెడ్డి స్థాయికి మించి విమర్శలు చేయడం సరికాదన్నారు. అనంతరం టిడిపి నాయకులు ఇ.వి.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గత 2019లో జగన్ ప్రత్యేక హోదా తెస్తామని, సిపిఎస్ రద్దు చేస్తామని, పోలవరం, అమరావతి పూర్తి చేస్తామని, కడప స్టీల్ ప్లాంట్ కు 3 సార్లు శంకుస్థాపన చేసి పూర్తి చేయకుండా వదిలేసి హామీలు విస్మరించలేదా అని ప్రశ్నించారు. వైసీపీ వారు పించను 1000 రూపాయలు 5 సంవత్సరాలు పెంచవచ్చు కానీ, కూటమి ప్రభుత్వంలో సంవత్సరంలోనే హామీలు అమలు చేయాలా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆనంద భార్గవరెడ్డి, లక్ష్మీపేట గురివిరెడ్డి, మార్తల గురువి రెడ్డి మాజీ జడ్పీటీసీ వెల్లాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పొలం పిలుస్తుంది కార్యక్రమం



సిద్ధవటం జూన్ 17 ప్రభాతవార్త:

మండలంలోని వంతాటిపల్లి రైతు సేవా కేంద్రంలోనీ ఎస్.రాజంపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు, ప్రేమ్ కుమార్ మండల వ్యవసాయ అధికారి రమేష్‌రెడ్డిలు హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం నాగరాజ పాల్గొని రైతులకు పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. అన్నదాత సుఖీభవ పథకం అమలు గురించి వివరించడం జరిగింది.లూజు విత్తనాలను రైతులు ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయరాదు అని తెలిపారు. జింక్ సల్ఫేట్, జిప్సం 50 సబ్సిడీపై పంపిణీ చేయడం జరుగుతుంది అని తెలిపారు. అలాగే ఎస్. రాజంపేటలో వరి ప్రధాన పంట. ఉత్తమ యాజమాన్య పద్ధతులు వివరించారు. వరి నారు నాటుటకు వారం రోజుల ముందు సెంటు విస్తీర్ణముకు 160 గ్రాములు చొప్పున కార్బోఫురాన్ గుళికలు వేసుకోవాలి. రసం పీల్చు పురుగులు, ఉల్లికోడు, కాండం తొలుచు పురుగు నివారణ జరుగుతుంది..అలాగే కాలి బాటలు,నారు కొసలు తుంచి నాటడం, గట్ల వెడల్పు పెంపు, జింక్,పొటాష్ వాడకం, నత్రజని సమతుల వాడకం వంటి అంశాలపై రైతులకు వివరించడ జరిగింది. 80 సబ్సిడీపై కిసాన్ డ్రోన్ పంపిణీ వంటి ప్రయోజనాలు వివరించడం జరిగింది.

## ఆరోపణల్లో వాస్తవం లేదు

కడప కార్పొరేషన్, జూన్ 17 ప్రభాతవార్త:




దళిత మహిళలని చూడకుండా సంబంధం లేని వారు దుష్ప్రచారాలు చేస్తున్నారని అఖిల భారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు కోటిపాటి సుబ్బమ్మ తెలిపారు. మంగళవారం కడపలోని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాయలసీమ జోన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉద్యోగాల పేరుతు వసూలుచేసినట్లు వస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా సంబంధం లేని వారు దళిత మహిళల అని చూడకుండా తనపై దుష్ప్రచారం చేయడం తగదన్నారు. తనపై నిరాధార ఆరోపణలు చేసిన వారిపై ఠాణలో ఫిర్యాదు చేస్తామన్నారు. తన పుత్రిక చిత్రాన్ని అంతర్జాలంలో వైరల్ చేసిన వారు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చిప్పగిరి మీనాక్షి, అరుణ కుమారి సహచరులు పాల్గొన్నారు.

## సభ సజావుకు సహకరించండి



కడప కార్పొరేషన్ జూన్ 17 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలపై చర్చించాల్సిన కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం ఆరు మాసాలు గడుస్తున్న జరగనే లేదు. బడ్జెట్ సమావేశము నిర్వహించలేదు. ఇది పూర్తిగా అధికారుల వైఫల్యమేనని వైసిపి కార్పొరేటర్‌లు విమర్శించారు. గత తీర్మానాలు అమలు సమాచారం లేదన్నారు. మంగళవారం కడప కార్పొరేషన్ మేయర్ చాంబర్‌లో కార్పొరేటర్ పాక సురేష్, బసవరాజు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన జనరల్ బాడి సమావేశానికి భద్రత కల్పించాలని, సభ్యులు కానీ టిడిపి నాయకులను అడ్డుకోవాలని జిల్లా కలెక్టర్ ను కోరినట్లు తెలిపారు. గతంలో జరిగిన సమావేశాలలో సభను సజావుగా జరగనీయకుండా ఎమ్మెల్యే అడ్డుపడ్డారని ఆరోపించారు. నగరవాసుల సమస్యలపై చర్చించాల్సిన సమావేశంలో కుర్చీ రాద్ధాంత రాజకీయాలు చేయడం తగదు అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మక్బూల్ బాషా, కె.బాబు, రామలక్ష్మారెడ్డి, ప్రసాద్ రెడ్డి, శ్రీరంజన్ రెడ్డి, శివ కోటిరెడ్డి, బాలస్వామి రెడ్డి, సుబ్బరాయుడు, ఐస్ క్రీం రవి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## వరుణ్ కుమార్ రెడ్డికి చిరు సత్కారం



ప్రొద్దుటూరు జూన్ 17 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు పట్టణ బిజెపి అధ్యక్షులు శంకదార నరేంద్రరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పాలకమండలి సభ్యులుగా నియమితులైన సేవా తత్పరులు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డికి మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు చీపిరాల నాగార్జున రావు మాట్లాడుతూ డాక్టర్ వరుణ్ కు ఈ అవకాశం రావడం ప్రొద్దుటూరు ప్రజలందరికీ గర్వకారణం అన్నారు జిల్లా కార్యదర్శి నేరెళ్ల మల్లికార్జున రావు మాట్లాడుతూ చిన్న వయసులోనే డాక్టర్ వరుణ్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ తాలూకా మండల సభ్యులుగా పొందడం అభినందనీయం అన్నారు ప్రభుత్వానికి మంచి సూచనలు సలహాలు ఇచ్చి గొప్ప పేరు తెచ్చుకోవాలని ఆయన ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా కోశాధికారి సివి జయలక్ష్మి బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు భూమిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రొద్దుటూరు నియోజకవర్గ బిజెపి కో కన్వీనర్ గౌరీ శంకర్ సభ్యులు నల్లదిమ్మె కుమారి శివనాగిరెడ్డి శివకుమార్ పరమేశ్వర రావు శ్రీ శ్రీ రవితేజ తదితరులు పాల్గొన్నారు

## వైసిపి నేతలు కారుకూతలు కూస్తే ఊరుకోం



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాసాగర్

మదనపల్లె, జూన్ 17 ప్రభాతవార్త :

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా తెలుగుతమ్ముళ్ళపై వైసిపి నేతల కారుకూతలు కూస్తున్నారని ఇలాంటి చౌకబార కూతలు కూస్తే సహించేది లేదంటూ మంగళవారం తేదేపా శ్రేణులు హెచ్చరించారు.స్థానిక బెంగుళూరు బస్టాండులోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టిడిపి నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని వైసిపి నేతలు గత రెండు రోజులుగా విలేకర్ల సమావేశాలు నిర్వహించి తెలుగుదేశం ప్రభుత్వం, ఎమ్మెల్యే షాజహాన్‌బాషాపై తప్పుడు ఆరోపణలు చేస్తూ పెద్దిరెడ్డి స్క్రిప్ట్ చదువుతున్నారని టౌన్ బ్యాంకు ఛైర్మెన్ నాదేండ్ల విద్యాసాగర్ విమర్శించారు. అభివృద్ధి అంటే తెలియని వైసిపి నాయకులని ఆయన విమర్శించారు. అక్రాలు, దౌర్జన్యాలకు పాల్పడుతూ బడుగు బలహీన దళిత వర్గాలపై దౌర్జన్యాలకు పాల్పడుతూ పాలన సాగించారని తెలిపారు. జడ్పిహైస్కూల్ ఆవరణంలో రూ.50లక్షలతో విద్యార్థుల కోసం డైనింగ్‌హాలు నిర్మించారని, వృద్ధాప్య పెన్షన్లు ఒకేసారి నాలుగువేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. పట్టణం అభివృద్ధి వైపు నడిపిస్తుంటే ఎమ్మెల్యేపై కారుకూతలు కూస్తున్నారని నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నీలకంఠ, మైనార్టీ నాయకులు ఎస్ఎం.రఫి, నాదేళ్ళ శివప్రసాద్, సుధాకర్, బాలుస్వామి, కత్తి లక్ష్మన్న, పురుషోత్తం, షంషీర్, యుగంధర్, మధు, పూలమురళి తదితరులు పాల్గొన్నారు.

## 14వ రోజుకు చేరిన కార్మికుల సమ్మె

### గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేత



గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మదనపల్లె, జూన్ 17 ప్రభాతవార్త :

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్యాలయం ముందు ఇంజనీరింగ్ కార్మికులు విధులు బహిష్కరించి చేస్తున్న సమ్మె 14రోజు మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించి నిరసనలు వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు శాంతియుతంగా నిరసన తెలుపుతున్నారని అందుకోసం శాంతియుత స్వాతంత్ర్య సమరయోధులు గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి సమస్యలు తెలుసుకొన్నామన్నారు. ఈ సందర్భంగా నాయకులు ఎస్.రెడ్డప్ప, ఎస్.కన్నయ్య, నాగరాజు, గోపాల్‌క్రిష్ణ, సజార్‌కుమార్‌లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం భాదాకరన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలనుకార్మికులకు అందజేయాలన్నారు. ప్రభుత్వం నాయ్యపరమైన తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఈనెల 22న సమ్మె ఉధృతం చేస్తామన్నారు.

## నిందితులపై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె, జూన్ 17 ప్రభాతవార్త :



భర్త చేసిన అప్పులు తీర్చకపోవడంతో భార్యను తాడుతో చెట్టుకు కట్టేసి హింసించి దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యసమాజం తలదించుకునే విధంగా అనాగరిక చర్య చిత్తూరుజిల్లా కుప్పం మండలం దాసేగానూరు పంచాయితీ నారాయణపురంకు చెందిన తిమ్మరాయప్ప అదే గ్రామానికి చెందిన మునిక్రిష్ణప్ప వద్ద అప్పు తీసుకొన్నాడు. తన వద్ద తీసుకొన్న అప్పు చెల్లించలేదని తిమ్మరాయప్ప భార్యను చెట్టుకు కట్టేసి హింసించాడు. ఈ ఘటన ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో జరగడంపై రాష్ట్రంలో మహిళలకు జరుగుతున్న అనాగరిక దాడులకు నిదర్శనంగా పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలకు పునరావృతంకాకుండా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టి మహిళలను హింసించిన మునిక్రిష్ణప్పపై చర్యలు తీసుకోవాలని సాంబశివ కోరుతున్నారు.


## బావిలోపడి వృద్ధురాలు మృతి

రామసముద్రం, జూన్ 17 ప్రభాతవార్త :

భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న ఓ వృద్ధురాలు ప్రమాదవశాత్తు నీరులేని బావిలో పడి మృతి చెందింది. మండలంలోని చెన్నారెడ్డిపల్లెకు చెందిన అదెప్ప భార్య రెడ్డమ్మ(60) చెంబకూరులో నివాసం ఉంటూ జీవనాధారం కోసం భిక్షాటన చేసుకుంటూ ఉండేది. వృద్ధురాలు మంగళవారం చెంబకూరు సమీపంలోని నీరులేని బావిలో పడి మృతి చెందింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం పుంగనూనరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పురుగుల మందు తాగి వివాహిత మృతి

రామసముద్రం, జూన్ 17 ప్రభాతవార్త :



కుటుంబ కలహాలతో ఓ వివాహిత పురుగుల మందు సేవించి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకొంది. కుటుంబ సభ్యుల మేరకు వివరాలిలావున్నాయి. మండలంలోని కాప్పల్లెకు చెందిన సంతోష్ భార్య అహల్య(27) కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఉదయం పురుగుల మందు తాగింది. దీంతో అపస్మారక స్థితిలో పడిఉండడంతో గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సలు పొందుతూ అహల్య మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు కలరు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సూర్య ఘర్‌పై అవగాహన సదస్సు

రామసముద్రం జూన్ 17 ప్రభాతవార్త



మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిధిగా మదనపల్లి డివిజన్ ఏడి. హరికుమార్, డిఈ. గంగాధర్ హాజరయ్యారు. ఏడి హరికుమార్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం కింద సౌర విద్యుత్ ప్లాంట్‌ను పెట్టు కోవడానికి 78 వేలు సబ్సిడీ ని కేంద్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడి. హరికుమార్, డిఈ. గంగాధర్, ఏఈ మస్తాన్ వల్లి విద్యుత్ కార్యాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## వాహనాలు ఢీకొని నలుగురికి గాయాలు




ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

పీలేరు జూలై 17 ప్రభాతవార్త ;

రెండు వాహనాలు ఢీకొని నలుగురికి గాయాలైన సంఘటన పీలేరు పరిధిలో చేస్తుంది అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలం శెట్టిపల్లి గ్రామం పాలెం గడ్డ హరిజనవాడకు చెందిన యాటా చంద్ర, యాటా సుబ్బరాయుడు తన సొంత పనుల నిమిత్తం కారులో దేవపట్ల నుండి చెన్నైకి వెళుతుండగా చెన్నై నుండి కర్నూలు ఇనోవా వాహనంలో వెళ్తున్న వాహనం మంగళవారం ఉదయం పీలేరు మండల పరిధిలో ముడుపుల వేముల సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న కారును ఇనోవా ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది దీంతో స్థానికులు 108 వాహనం ద్వారా పీలేరు ప్రభుత్వఆసుపత్రికి తరలించారు ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తుంది పాలెం గడ్డ హరిజనవాడకు చెందిన చంద్ర (38) కుడికాలు పూర్తిగా నలిగిపోయి ఒళ్లంతా గాయాలు అయ్యాయి, అదే గ్రామానికి చెందిన సుబ్బరాయుడు ఏడమ చేయి విరిగి, తలకు తీవ్ర గాయలయ్యాయి, కారు డ్రైవర్ ప్రసన్నకుమార్ కు మోకాలు దగ్గర పెద్ద గాయమైంది, అదేవిధంగా చెన్నై నుండి కర్నూలు కి ఇనోవా లో నలుగురు ప్రయాణిస్తుండగా ఉదయ్ కి (22) ఎడమ చేయి షోల్డర్ చెస్ట్ దగ్గర గాయం అయింది మిగిలిన ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు వీరిని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య కోసం తిరుపతికి రిఫర్ చేశారు ఈ మేరకు పీలేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మండల పరిశీలకుడిగా భగవాన్‌సహాయరెడ్డి

సుండుపల్లె, జూన్ 17, ప్రభాతవార్త:



రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గం రామాపురం మండలానికి తెలుగుదేశం పార్టీ మండల పరిశీలకుడి(అబ్జర్వర్)గా సుండుపల్లి మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు యనమల భగవాన్ సహాయ రెడ్డిని మంగళవారం నియమించినట్లు పార్లమెంటు మేనేజర్ రెడ్డి నారాయణ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా భగవాన్ సాహాయరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధిష్టానం తనపై నమ్మకం ఉంచి రామాపురం పరిశీలకుడిగా నియమించడం సంతోషదాయకం అన్నారు. పార్టీ ఆదేశానుసారం పనిచేస్తామన్నారు.

## ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలి

### ఎన్.ఎస్.యూ.ఐ, టి.ఎన్.ఎస్.ఎఫ్, డి.బి.ఎస్.ఎఫ్, ఎస్.ఎఫ్.ఐ డిమాండ్



తహసిల్దార్ కు వినతి పత్రాలు చేస్తున్న దృశ్యం

పీలేరు జూన్ 17 ప్రభాతవార్త :

నియోజకవర్గంలోని కలకడ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు పురుగులు పట్టిన బియ్యాన్ని వాడుతూ భోజనం అందిస్తున్న ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్.ఎస్.యూ.ఐ, టి.ఎన్.ఎస్.ఎఫ్, డి.బి.ఎస్.ఎఫ్, ఎస్.ఎఫ్.ఐ నాయకులు ఎమ్మార్వోకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల.అమృత్ తేజ,ఎన్.ఎస్.యూ.ఐ జిల్లా అధ్యక్షులు సాయి సంపత్ కుమార్, టి.ఎన్.ఎస్.ఎఫ్ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి చంద్రబాబు నాయుడు, డి.బి.ఎస్.ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బద్దె భాను ప్రకాష్, ఎస్.ఎఫ్.ఐ నాయకులు మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన బియ్యాన్ని మధ్యాహ్న భోజన పథకం కోసం సరఫరా చేయుచున్నా, ఆ బియ్యాన్ని వాడకుండా పాతది, పురుగులు పట్టిన బియ్యాన్ని వాడుతూ విద్యార్థులకు భోజనం అందిస్తున్నారని తెలిపారు. ఇది విద్యార్థుల ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదం కలిగించే అంశం అన్నారు. అదే విధంగా, ప్రభుత్వం విద్యార్థుల పోషకాహార అవసరాల కోసం వారానికి కోడిగుడ్లు మరియు చిక్కీలు ఇవ్వాలని సూచించినా, అవి విద్యార్థులకు సకాలంలో ఇవ్వకుండా నిల్వచేసి చెడిపోవడం వల్ల చెత్తకుప్పలలో పారేస్తున్నారన్న గుర్తించడం జరిగింది అని అన్నారు. స్థానిక కలకడ ఎమ్మార్వో మహేశ్వరిబాయ్ కి వినతిపత్రాన్ని సమర్పించడం జరిగింది. విచారణ జరిపి బాధ్యులపై తగినచర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు కార్తీక్, యువరాజ్ పాల్గొన్నారు.

## వాహనంతో సహా ఎర్రచందనం స్వాధీనం

పీలేరు జూన్ 17 ప్రభాతవార్త :

ద్విచక్ర వాహనంతో సహా ఎర్రచందనం మొద్దులు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు అటవీ శాఖ సంచారదళ నిఘా విభాగం డిఎఫ్ఓ ఎం. గురు ప్రభాకర్ తెలిపారు. మంగళవారం ఆయన పీలేరులో మీడియాతో మాట్లాడుతూ సోమవారం రాత్రి తమ కార్యాలయానికి అందిన రహస్య సమాచారం మేరకు రాత్రి చిత్తూరు జిల్లా, కందూరు సమీపంలోని కలికిరి సోమల రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా మంగళవారం తెల్లవారు జామున అన్నమయ్య జిల్లా, కలికిరి వైపు నుంచి ఓ ద్విచక్ర వాహనం వేగంగా రావడాన్ని గుర్తించి ఆపేందుకు తమ సిబ్బందితో ప్రయత్నించామన్నారు. అయితే ఎర్రచందనం దొంగలు వాహనం ఆగకుండా వేగంగా ముందుకు దూసుకు వెళ్లారని చెప్పారు. అప్రమత్తమైన తాము ఆ వాహనాన్ని వెంబడించగా నిందితులు ఇరువురు సోమల సమీపంలో వాహనాన్ని, రెండు బస్తాల ఎర్రచందనం మొద్దులు విడిచి చీకట్లో పరారయ్యారని అన్నారు. ఎర్రచందనం దొంగలు ఉపయోగించిన వాహనాన్ని, ఎర్రచందనం మొద్దుల బస్తాలను స్వాధీనం చేసుకుని పీలేరు సంచారదళ నిఘా విభాగం కార్యాలయానికి తరలించామన్నారు. రెండు బస్తాల్లోనూ 92 కేజీల బరువు గల 36 మొద్దులు గుర్తించామన్నారు. అపాచీ ద్విచక్ర వాహనంతో సహా ఎర్రచందనం మొద్దుల విలువ సుమారు రూ.2,50,000 లు ఉంటుందని అంచనా వేశారు. ఈ దాడిలో డిఎఫ్ఓతో పాటు ఎఫ్ఆర్ఓ ఎస్. చంద్రశేఖర్, ఎఫ్ఎస్ఓ కె. ప్రకాష్, ఎఫ్.బి.ఓ లు కె. ప్రతాప్, పి. రెడ్డి ప్రసాద్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.



పట్టుబడిన వాహనం, ఎర్రచందనం మొద్దులతో నిఘా విభాగం అధికారులు

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



యోగా కార్యక్రమం నిర్వహిస్తున్న చందులూరి బ్రహ్మయ్య

పోరుమామిళ్ల రూరల్, జూన్ 17 ప్రభాతవార్త:

పోరుమామిళ్ల మండలం వెంకటాపురం ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఉదయం ఆర్ట్ ఆఫ్ లివింగ్ యువ ఆచార్య చందులూరి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థిని,విద్యార్థులకు యోగ యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రాణాయామం, ధ్యానం గురించి వివరించడమే కాకుండా విద్యార్థిని, విద్యార్థులతో సాధన చేయించారు.ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యార్థులు యోగాలో ప్రవేశిస్తే మంచి క్రమశిక్షణ అలవరచుకుని ఏకాగ్రతతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పొందడమే కాకుండా చదువులో మంచి ప్రావీణ్యం పొంది బంగారు భవిష్యత్తుకు బాటలు వేయగలరని అన్నారు. నిరంతరం యోగ సాధన చేసి మంచి ఆరోగ్యాన్ని పొంది పాఠశాలకు, కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ అవకాశం ఇచ్చిన ప్రధానోపాధ్యాయురాలు సుమలతకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గురుమూర్తి, రాజా,సుబ్రమణ్యం, తిరువీధి జయరాములు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మహాసభలు జయప్రదం చేయండి

పోరుమామిళ్ల రూరల్, జూన్ 17 ప్రభాతవార్త:



ఈనెల 23వ తేదీన సిపిఐ 10వ మండల మహాసభ విజయవంతానికి మండల ప్రజలు సహకరించాలని పట్టణ సహాయ కార్యదర్శి కేశవ, కార్యవర్గ సభ్యులు చెన్నయ్యలు పార్టీ సభ్యులకు కార్యకర్తలకు అభిమానులకు శ్రేయోభిలాషులు అందరూ కూడా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మంగళవారం సిపిఐ నాయకులు మాట్లాడుతూ పోరుమామిళ్ల మండల మహాసభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర,జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ నియోజకవర్గంలోని కార్యవర్గ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై, సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం ప్రజల కోసం కష్టజీవుల కోసం చమట చుక్కలు రైతు నీరుగా మారితే, రక్తాన్నిగా ప్రజల కడుపు ఆకలి తీర్చడానికి రైతన్న కోసం ప్రాజెక్టులో పంట కాలవలు పూర్తి చేయాలన్నారు. మండల సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా నిరంతరం పేద బడుగు బలహీన వర్గాల కోసం పోరాటం చేస్తూనే ఉంటామని పదవ మండల మహాసభ కరపత్రాలు విడుదల చేశారు. అలాగే భవిష్యత్తు పోరాటాలకు నిరంతరం ప్రజల కోసమే పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్ష కార్యదర్శులు సఫా, పీరయ్య, శ్రీనివాసులు, శాఖ కార్యదర్శి వెంకటేశ్వర్లు, విష్ణు, రామసుబ్బయ్య, చాంద్ భాషా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలు తనిఖీ

### రూ.32 వేలు జరిమానా, ఒక ఆటో సీజ్



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎంవిఐ బృందం

పీలేరు జూన్ 17 ప్రభాతవార్త :

పీలేరు రాయచోటి రహదారిలోని పొంతలచెరువు క్రాస్ వద్ద ప్రత్యేక వాహనాల తనిఖీ చేసినట్లు పీలేరు ఎంవిఐ విజయ కుమారి, ఆర్టీసీ డిఎం నిర్మల తెలిపారు. మంగళవారం వారు పీలేరు మండలం, పొంతలచెరువు క్రాస్ వద్ద నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న ప్యాసింజర్ వాహనాలు, ఆటోలను ఆపి తనిఖీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఆరు వాహనాలను తనిఖీ చేసి నిబంధనలకు వ్యతిరేకంగా ప్రయాణికులను తరలిస్తున్న ఆటో దారులకు రూ.32 వేలు జరిమానా విధించి, ఒక ఆటోను సీజ్ చేసినట్లు చెప్పారు. అలాగే ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఆటోల్లోంచి ప్రయాణికులను ఆర్టీసీ బస్సులు ఎక్కించి, ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం సౌకర్యం, సురక్షితమని వారికి తెలియజేశారు. ఈ తనిఖీలో వాహనాల రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ లు పరిశీలించారు. ఈ దాడుల్లో ఆర్టీసీ ఉద్యోగులు కెసిఎస్ రెడ్డి, బాబు నాయక్, ఏడిసి కెఎన్ రెడ్డి, ఎంవిఐ సిబ్బంది పాల్గొన్నారు.


## ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలి

సుండుపల్లె, జూన్ 17, ప్రభాత వార్త:

ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల ఫీజులు దోపిడీని అరికట్టాలని గిరిజన స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు నాగేంద్ర నాయక్ చౌహాన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను వారి తల్లి దండ్రులను మోసం చేస్తూ అడ్మిషన్ల పేరుతో దోపిడికి గురి చేస్తున్నాయని, అధిక ఫీజులు వసూలు చేసి పేద ప్రజల కడుపుకోడు తున్నారని అన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలన్నారు. అర్హత పరీక్ష పేరుతో పరీక్షలు నిర్వహిస్తూ ఫీజులు వసూలు చేస్తూ, యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు పేరుతో వేలాది రూపాయలు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి దోచుకుంటు వ్యాపారం చేస్తున్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల పైన చర్యలు చేపట్టాలని, లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, ఆందోళనలు చేస్తామన్నారు.

## వ్యవసాయ అధికారిగా మంజుల

నిమ్మనపల్లి జూన్ 17 ప్రభాతవార్త



మండల వ్యవసాయ అధికారిగా మంజుల మంగళవారం పదవి బాధ్యతలు చెప్పటారు. ఈమె కడప జిల్లా పోరుమామిళ్ల నుంచి రాగ ఇక్కడ పని చేయు మురళి మోహన్ వాల్మీకిపురం కు బదిలి అయ్యారు.

## లెక్కలవారిపల్లెలో రైతు సదస్సు

మైదుకూరు, జూన్ 17, ప్రభాతవార్త:

కృషి విజ్ఞాన కేంద్రం వనిపెంట ఆధ్వర్యంలో లెక్కల వారి పల్లె గ్రామపంచాయతీలో రైతు సదస్సు నిర్వహించారు. ఉద్యాన కళాశాల అనంతరాజుపేట బిఎస్‌సి ఉద్యాన శాస్త్ర విద్యార్థులు గ్రామీణ ఉద్యాన పని అనుభవ పథకములో భాగంగా ఈ సదస్సును నిర్వహించారు. కెవికె సీనియర్ శాస్త్రవేత్త మరియు అధిపతి డాక్టర్ యం. బాలక్రిష్ణ అధ్యక్షతన అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యాన కళాశాల అనంతరాజుపేట కీటక శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ యం.రామయ్య మరియు ఉద్యాన శాస్త్ర అధ్యాపకుడు చంద్రమోహన్ రెడ్డి, మైదుకూరు ఉద్యాన శాఖ అధికారి రామక్రిష్ణ, గ్రామ సర్పంచ్ జయ భారత రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవి, మాజీ సర్పంచ్ శివప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. మొదటగా డాక్టర్ యం.బాలక్రిష్ణ, ఈ కార్యక్రమ విధివిధానాలు, రైతులకు పొందే విధంగా ఉపయోగం, విద్యార్థులు రైతుల ద్వారా ఈ విషయ పరిజ్ఞానాన్ని పొందడం, వివిధ పంటల పోషక యాజమాన్య పద్ధతులు భూసార పరీక్షల ఆవశ్యకత, విత్తన శుద్ధి వివిధ పంట రకాలు, కెవికె చేస్తున్న కార్యచరణ ప్రణాళికల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులు, బి.పి.ప్రతాప్ రెడ్డి, బాల నరసింహారెడ్డి, గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున రైతులు సోదరులు సోదరీమణులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారని తెలియజేశారు.



# యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలి






**రాయచోటి, జూన్ 17 ప్రభాత వార్త**

ఈనెల 19న హార్సిలీ హిల్స్లో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఈనెల 19న హార్సిలీ హిల్స్లో వెయ్యి మందితో నిర్వహించబోయే యోగాంధ్ర కార్యక్రమంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీ హిల్స్ లో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని, దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేసుకోవాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా వివిధ పర్యాటక కేంద్రాలలో నిర్వహిస్తున్న సందర్భంగా ఈ నెల 19న హార్సిలీ హిల్స్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం విజయవంతమయ్యేలా చూసుకోవాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం ను ప్రత్యేకంగా ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం, పిడి డి ఆర్ డి ఏ సత్యనారాయణ, జి ఎస్ డబ్ల్యూ ఎస్ శాఖ అధికారి లక్ష్మీపతి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్

**పులివెందుల,జూన్ 17,ప్రభాత వార్త:**


వినతులు స్వీకరిస్తున్న ఎంపీ

రాష్ట్రంలోనీ ప్రతి కార్యకర్త ,ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ ను నిర్వహిస్తున్నట్లు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం ఎంపీ నివాసం వద్ద నిర్వహించిన ప్రజా దర్బార్కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజా దర్బార్ కు చుట్టూ ప్రక్కల గ్రామాల నుంచి పట్టణాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారు. ఈ సందర్భంగా నాయకులకు కార్యకర్తల సమస్యల విన్న అనంతరం వారితో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా అన్ని విధాల వారిని ఆదుకుంటా ఎవరు అధైర్య పడవద్దు అని అన్నారు.ప్రతి కార్యకర్త సమన్వయం పాటించాలి. ప్రజల తరుపున ఎంత వరకైనా పోరాడటానికి సిద్దంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డైట్ మ్యాగజైన్ కోసం రచనలకు ఆహ్వానం



**రాయచోటి జూన్ 17 ప్రభాతవార్త**

జిల్లా విద్యా శిక్షణా సంస్థ వెలువరించే నెలవారీ పత్రికలో ప్రచురణ కోసం జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల నుండి రచనలను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అజయ్ కుమార్ బాబు తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక డైట్ విద్యా కేంద్రంలో పత్రికపై అధ్యాపకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యావిషయక విజ్ఞాన అంశాలతో పత్రిక ఉండాలన్నారు. పాఠశాలల్లో అమలు చేసే వినూత్న పద్ధతులు, సృజనాత్మక బోధన విధానాల గురించి పత్రిక ద్వారా తెలియజేయవచ్చన్నారు. అనంతరం పత్రిక ఎడిటర్, సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు పత్రిక కోసం వ్యాసాలు, కవితలు, గేయాలు పంపవచ్చన్నారు. రచనలు తమ స్వంతమేనని, ఇంతవరకు ప్రచురితం కాలేదని రచనతోపాటు ధ్రువీకరణ పత్రం పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గిరిబాబు యాదవ్, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, సుబ్బారెడ్డి, కేదార్నాథ్, రెడ్డయ్య, మోహన్ నాయక్, కలీముల్లా తదితరులు పాల్గొన్నారు.

## తల్లికి వందనం ప్రతి ఇంటిలో ఆనందం


చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

**పీలేరు జూన్ 17 ప్రభాతవార్త :**

కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకు తల్లికి వందనం పేరుతో ప్రతి ఇంట్లో ఎంతమంది చదువుకుంటుంటే అంతమందికి 15000 ప్రకారం చెల్లించిన చంద్రబాబు నాయుడు నాయకత్వం దీనికి హర్షం తెలియజేస్తూ తల్లిదండ్రులు చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం జరిపించారు పీలేరు నియోజకవర్గ జననేత జనం మెచ్చిన నేత శ్రీ నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు తల్లికి వందనం చేరేటట్లు చూడాలని తెలుగుదేశం పార్టీ నాయకులను కార్యకర్తలను పురమాయించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పోలిశెట్టి సురేంద్ర, తెలుగుదేశం పార్టీ మరియు ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు శ్రీ శ్రీనాథ్ రెడ్డి ,స్కూల్ కమిటీ చైర్మన్ మస్తాన్ ,తెలుగుదేశం నాయకులు శ్రీనాథ్ ,శ్రీకాంత్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్దే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


విద్యార్థులకు పుస్తకాలు పంపిణి చేస్తున్న ఎమ్మెల్యే


మురికి కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**మదనపల్లెక్రైం, జూన్ 17 ప్రభాతవార్త :**

విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అచ్చుపుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్స్ ను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్ణయాలతో విద్యలో రాష్ట్రం చాలా వెనకబడిపోయిందన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా, నారాలోకేష్ విద్యాశాఖ మంత్రిగా విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థికి తల్లివందనం పేరుతో రూ.15వేల నగదు, ఉచితంగా పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్స్ పంపిణితో పాటు, డొక్క సీతమ్మ మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నారన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందజేసే పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అకాక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, హెచ్ఎం సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**వార్డు పర్యటన....** మదనపల్లె పట్టణంలోని సొసైటీ కాలనీలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వార్డు పర్యటన చేపట్టారు. వార్డులో గల సమస్యలను ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. వార్డులో వున్న డ్రైనేజ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

**టిడిపి కార్యకర్త మృతి పట్ల సంతాపం...** మదనపల్లె పట్టణం చీకులగుట్ట గౌతమినగర్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త వెంకటరమణ మృతి పట్ల ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సంతాపం తెలిపారు. మంగళవారం వెంకటరమణ మృతదేహం వద్ద నివాళులు అర్పించిన ఎమ్మెల్యే, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీపరంగా వెంకటరమణ కుటుంబంకు అండగా వుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట టిడిపి నాయకులు, కార్యకర్తలు వున్నారు.

## అలరించిన చిన్నారుల యోగాసనాలు..




**కడప కార్పొరేషన్ జూన్ 17 ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వము ఎంతో ప్రతిష్టాత్మకంగా యోగాను నిర్వహిస్తుందని వ్యాయామ ఉపాధ్యాయుడు శివశంకర్ రెడ్డి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ౖగగన్నపల్లిలో విద్యార్థులు యోగాసనాలు చేశారు. ఉపాధ్యాయులు కూడా యోగ ఆసనాల సాధన చేస్తూ విద్యార్థులకు మార్గదర్శకులుగా వ్యభిచారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శివ శంకర్ రెడ్డి అన్నారు. యోగ సాధన వలన మనిషి తన భావోద్వేగా లు అన్నిటిని అదుపులో ఉంచుకోవచని అభిప్రాయపడ్డారు. యోగ ఆసనాల ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది అన్నారు.

## కళ్యాణోత్సవ ఆహ్వాన పత్రికలు విడుదల



**(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)**

రాజంపేట పట్టణం ఈడిగ పాలెంలో వెలసిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి, శ్రీ బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం కల్యాణోత్సవ పత్రికలను భక్తుల చేతుల మీదుగా విడుదల చేశారు. జూలై 20వ తేదీ ఆదివారము ఆడికృత్తిక సందర్భంగా ఒకే వేదికపై శ్రీ సిద్ధి బుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయక స్వామి, శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవ ఆహ్వాన పత్రికలను మంగళవారం మూలవిరాట్లకు అభిషేకము అనంతరం భక్తుల చేతుల మీదుగా విడుదల చేసినట్లు ఆలయ ధర్మకర్త మలిశెట్టి అనసూయమ్మ తెలిపారు. కల్యాణోత్సవములో భక్తులు ఎలాంటి రుసుము లేకుండా పాల్గొనవచ్చన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు కల్యాణోత్సవంలో ఉంచిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి డాలర్ తో పాటు పసుపు కుంకుమ పసుపు దారము గాజులు అందజేయబడునున్నారు. కల్యాణోత్సవం లో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి శాంతి హోమం, శ్రీ వినాయక హోమం, శ్రీ కాల సర్ప దోష నివారణ హోమాలు జరుగుతాయన్నారు. కల్యాణోత్సవములో భక్తులకు అన్న ప్రసాద వినియోగము ఉంటుందన్నారు. కనుక భక్తులు విరివిగా పాల్గొని దేవేరులతో కూడిన స్వామి వాల్ల కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆమె కోరారు.

# నేటి నుండి 23 వరకు వైభవంగా ప్రారంభం కానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు







**బద్వేల్ అర్బన్ జూన్ 17 : ప్రభాతవార్త :**

బద్వేల్ పట్టణంలోని సిద్ధవటం రోడ్డు ఫైర్ ఆఫీస్ వెనుక వెలసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి అభయ ఆంజనేయస్వామి దేవాలయం దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 18,వ తారీకు బుధవారం నుండి 23,వ తారీకు సోమవారం వరకు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు వ్నల్ల కొండు వెంకటరమణ, అధ్యక్షులు నిమ్మకాయల గురివిరెడ్డి, గౌరవ సలహాదారులు సీనియర్ అడ్వకేట్ జి, త్రివిక్రమ్ సింగ్, సెక్రటరీ గొడిశిపాటి అంకయ్య, వల్లంకొండు శివకుమార్, మెంటా వెంకట నాగేంద్ర, సల్లగొలుసుల శ్రీనివాసులు, ఆలయ అర్చకులు నడిగట్ల వీరేశాచార్యులు తోపాటు పలువురు కమిటీ సభ్యులు తెలిపారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా 18,వ తారీఖు బుధవారం సాయంత్రం విశ్వకేశాన ఆరాధన పుణ్యాహ వచనం రక్షాబంధనం మృత్సం గ్రహణం యాగశాల ప్రవేశం అంకురార్పణ గరుడ పట ఆదివాసము తీర్థప్రసాద వినియోగం అలాగే గురువారం ద్వజారోహణం దేవతాహ్వానము మహా కుంభ ఆరాధన చతుస్థానార్చన తీర్థప్రసాద వినియోగమని సంతాన ప్రాప్తి కొరకు గరుడ ప్రసాదం అనంతరం సాయంత్రం శేష వాహనలో స్వామివారు భక్తులకు దర్శనం కలదు, అలాగే శుక్రవారం ఉదయం చతుర్థానర్చన లక్ష్మీనారాయణ హోమం వేద స్వస్తి సాయంత్రం హనుమాన్ వాహనం పైన భక్తులకు దర్శనం, అలాగే 21వ తారీకు శనివారం ఉదయం 9 గంటల నుండి అంగరంగ వైభవంగా స్వామివారి కల్యాణ మహోత్సవం కార్యక్రమం కలదు, అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం తదుపరి సాయంత్రం గరుడవాహన సేవలో పురవీధులలో భక్తులకు స్వామివారు దర్శనం ఇవ్వనన్నారు, స్వామివారి గ్రామోత్సవం వెంబడి వల్లేరవారి పల్లెకు చెందిన శ్రీకృష్ణ కోలాటం మాస్టర్ వెంకీ వారి బృందంకి కోలాటం కలదు, ఆదివారం ఉదయం చతుర్థానర్చన లక్ష్మీ హయగ్రీవ హోమము వేద స్వస్తి సాయంత్రం తిరుచ్చి వాహన సేవలు భక్తులకు స్వామివారి దర్శనం 23 సోమవారం ఉదయం చక్రస్నానం, సాయంత్రం ధ్వజారోహణం, మహా పూర్ణాహుతి, కుంభ సంప్రోక్షణ మరియు వైభవంగా స్వామి వారికి పుష్పయాగం మహాదాశీర్వచనం కలదు, కావున స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో పట్టణ పరిసర ప్రాంత ప్రజలందరూ పాల్గొని స్వామి వారి కార్యక్రమాలు తిలకించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరు తెలియజేయడమైనది.

### భక్తులు స్వామివారి ఉత్సవాలలో పాల్గొని జయప్రదం చేయాలి



శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి, అభయ ఆంజనేయ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భక్తులందరూ విరి విరిగా పాల్గొని జరగబోవు బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలి, అంగరంగ వైభవంగా స్వామివారి బ్రహ్మోత్సవాలను నిర్వహించడం జరుగుతుంది, స్వామివారి ఉత్సవాలలో హోమాలలో పాల్గొనదలుచుకున్న భక్తులు నేడు సాయంత్రం 6 గంటలకు ఆలయం వద్దకు చేరుకోవాలి, ఆరు రోజులు పాటు నిర్వహించబోవు స్వామివారి హోమాలలో పాల్గొనదల్చుకున్న భక్తులు ఆలయానికి ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదు, కావున భక్కాదులందరూ స్వామివారి బ్రహ్మోత్సవాలలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరు

**ఆలయ ప్రధాన అర్చకులు వీరేశ చార్యులు బద్వేల్**

### వైభవంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు :



బద్వేల్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి, అభయ ఆంజనేయ స్వామి దశమి వార్షిక బ్రహ్మోత్సవాలలో భక్తాదులు, ఆలయ కమిటీ సభ్యులు అందరూ విరివిరిగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని జరగబోవు స్వామివారి బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలి, భక్తాదులందరూ స్వామివారిని దర్శించుకొనుటకు ముందస్తుగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగింది, కావున కడప జిల్లా స్థాయిలో ప్రజలందరూ స్వామివారి ఉత్సవాలలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ఆరు రోజులు పాటు జరగబోవు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చేయాలి

**ఆలయం గౌరవ సలహాదారులు సీనియర్ అడ్వకేట్ త్రివిక్రమ్ సింగ్**


## సబ్సిడీ వేరుశనగ కాయలు సద్వినియోగం చేసుకోవాలి



**లక్కిరెడ్డిపల్లి : జూన్ 17 ప్రభాతవార్త**

మండల పరిధిలోని దిన్నెపాడు , కస్తూరి రాజు గారి గ్రామలలో ఆర్ బి కేనందు సబ్సిడీ వేరుశనగ కాయలు పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. యనమల మదన్ మోహన్ మాట్లాడుతూ ఖరీఫ్ కోసం రైతులుకు 50 శాతం సబ్సిడీతో వేరుశనగ కాయలను ప్రభుత్వం సరఫరా చేస్తుందని తెలిపారు. రానున్న ఖరీఫ్ కోసం వేరుశెనగ గింజలను సిద్ధం చేసుకోవాలని రైతులకు తెలిపారు. మన రాష్ట్ర రవాణా, యువజన , క్రీడా శాఖ మంత్రి , ఆయన సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రైతులు కావాల్సిన టువంటి కందులు, ఉలవలు, అలసందలు, ఆముదాలు మొదలైనటువంటి విత్తనాలు అవసరం ఉన్న మేరకు సకాలంలో రైతులకు అందేలా వారి సహకారంతో రైతులకు పంపిణీ చేస్తాం అని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తన కాయలు సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద త్వరలోనే మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతులకు 20 వేల రూపాయల నగదును నేరుగా రైతులకు వారి అకౌంట్ లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి రాజ కుమారి, క్లాస్ వన్ కాంట్రాక్టర్ యాగంటి పాపయ్య, రాజంపేట డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి షఫీ నాయక్, దేవానంద రెడ్డి, జయరాములు, ధర్మ రాజు, జనార్దన్ రెడ్డి, సిద్ధక వెంకట్రామిరెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## ఆర్డిఓ ను కలిసిన రామాపురం తాసిల్దార్



**రాయచోటి జూన్ 17 ప్రభాతవార్త**

రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు ను రామాపురం తాసిల్దార్ వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు ఈ సందర్భంగా రామాపురం తాసిల్దార్ కార్యాలయానికి వచ్చే రైతులను తిప్పుకోకుండా భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యార్థులు కుల ఆదాయ సర్టిఫికెట్లను కూడా వెంటనే పరిష్కరించాలన్నారు గ్రామాల నుంచి భూ సమస్యలపైవచ్చే రైతులను కార్యాలయం చుట్టూ చెప్పుకోకుండా భూ సమస్య లను ఎప్పటికప్పుడు పరిష్కరించాలనీ ఆర్డిఓ రామాపురం తాసిల్దార్‌కు సూచించారు.

## కారు ఢీకొని వ్యక్తికి గాయాలు.. రిమ్స్‌కు తరలింపు...

**పోరుమామిళ్ల రూరల్, జూన్ 17 ప్రభాతవార్త:**

మండలంలోని అక్కల్ రెడ్డి పల్లె గ్రామ సమీపంలో శాంతివనం దగ్గర అమరావతికి వెళ్లే ప్రధాన రహదారిలో దాసరి పల్లె సోమయ్య అలియాస్ సామ్యూల్ ను గుర్తు తెలియని కారు ఢీకొని వెళ్లిన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే దాసరపల్లి సోమయ్య అలియాస్ శామ్యూల్(73) కి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయనను పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అనంతరం మెరుగైన వైద్య సేవల నిమిత్తం కడప రిమ్స్ కు తరలించారు. ఈ మేరకు పోరుమామిళ్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో అధిక మిగులు.

**చిట్వేలి, జూన్ 17, ప్రభాతవార్త:**

ప్రకృతి వ్యవసాయం సాగు ద్వారా వ్యవసాయ ఖర్చులు మిగులతో పాటు భూసారాన్ని పెంచి ప్రకృతి సమతుల్యతను పెంపొందించేందుకు దోహదపడుతుందని మండల వ్యవసాయ అధికారి జి సుధాకర్ అన్నారు. మంగళవారం మైలపల్లి, పోలోపల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించి ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు.ఏ ఓ. సుధాకర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గి నాణ్యమైన దిగుబడితో రైతులు గిట్టుబాటు ధరలు పొందవచ్చున్నారు. రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలనీసూ సించారు. అంతరపంటలు వేయడం ద్వారా అదనపు ఆధాయం పొందవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తమపరిదిలో రైతులను ప్రకృతి వ్యసాయం వైపు మొగ్గుచూపేలా కృషి చేయాలని ఆదేశించారు. పి ఎం కిసాన్ కోసం ఇప్పటికే ఈ కే వై సి చేసుకున్నవారు ఇప్పుడు అన్నదాత సుఖీభవ కోసం ఈ కే వై సి అవసరం లేదని ఏ ఓ. సుధాకర్ రైతులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, విహెచ్ఏ లు నరసింహ, ఓబయ్య, గ్రామ రైతులు పాల్గిన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఏవో, సిబ్బంది.

## వేరుశనగ విత్తన కాయల పంపిణీ.

**తంబళ్లపల్లె జూన్ 17 ప్రభాతవార్త ః**

మండలం గుండ్లపల్లి పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో మంగళవారం వేరుశనగ విత్తన కాయలు టిడిపి నాయకులు పంపిణీ చేపట్టారు. వేరుశనగ పంట సాగుపై రైతులు సస్యరక్షణ పాటించాలని ఏఈఓ జయరాం రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీకాంత్, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డప్ప నాయుడు, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ కాల నారాయణ, టిడిపి పార్లమెంట్ కో కన్వీనర్ మధు నాయుడు, శివారెడ్డి, జైపాల్ నాయుడు, శ్రీరాములు నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్ నాయుడు, వెంకట్ రెడ్డి, టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.



## పారిశుద్ధం మెరుగుకై ప్రత్యేక చర్యలు చేపట్టండి

**బద్వేల్ అర్బన్, జూన్ 17 ప్రభాతవార్త**

పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు శానిటేషన్ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ సింహారెడ్డి సూచించారు.ఈ మేరకు ఆయన మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు ఇస్తూ పారిశుద్ధం మెరుగుకై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. తోపుడు బండ్ల వారికి డస్ట్ బిన్లు ఇచ్చినప్పటికీ రోడ్డుపై చెత్త వేస్తున్నారని, అలాగే ఆయా షాపుల యజమానులు కూడా చెత్త రోడ్డుపై వేయడం తగదని సూచించడం జరిగింది. ఇందుకోసం సెక్రటరీలు ఫీల్డ్ సర్వే నిర్వహించి ఎక్కడ చెత్త లేకుండా చూసి బద్వేలు సుందరీకరణకు తమ వంతు తోడ్పాటు నందించాలని సూచించారు .అలాగే ఆయా షాపులో యజమానులు ట్రేడ్ లైసెన్సు లు కలిగి ఉండేలా చూడాలన్నారు.

